కథ

అనసూయంటే మా ఇంట్లో వాళ్లందరికీ ఇష్టమే.

మొదట్లో ఆమె అంటే అసలు ఇష్టం ఉండేది కాదు. దీర్ఘాలు తీస్తూ అర్థమయ్యీ కానట్లు అరచే అరుపు సందు చివర వినబడిందంటే అందరం తలుపులు బిడాయించుకొని ఇంట్లో ఎవరూ లేని వాళ్లలా ప్రవర్తించేవాళ్లం. అనసూయది పాత గుడ్డలు తీసుకుని స్టీల్ సామాన్లు ఇచ్చే వ్యాపారం. దీన్ని వ్యాపారం అనాలో బతుకు తెరువనాలో తెలీదు కానీ, ప్రతీ రోజు గంపలో స్టీల్ సామాన్లు పెట్టుకొని ఇంటింటికి తిరుగుతుంది. రుతువులతో ఆమెకు పనిలేదు. నిప్పులు చెరిగే ఎండలో కూడా చెప్పులు లేకుండా తిరగ్గలదు. నిజం చెప్పొద్దూ... మా అమ్మకు స్టీల్ సామాన్ల పిచ్చి కాస్తే ఎక్కువే. అందుకే అనసూయతో కాస్త పరిచయం ఏర్పడింది. అప్పుడప్పుడు తన సామాను కూడా మా ఇంట్లోనే పెట్టి వెళ్లేది. ఈ కారణంగా కాస్త చనువు కూడా ఏర్పడింది. వారానికి కనీసం ఓసారైనా వచ్చి మా అమ్మను విసిగిస్తూ ఉండేది.

# అనురాగం...

భిన్నూరి బాలసుబ్రహ్మణ్యం



000

టెలివిజన్ ఛానెళ్ల న్యూస్ బులెటిన్ల నిండా గుజరాత్‌లో జరిగిన మారణకాండకు చెందిన దృశ్యాలే. అవి విని, చూసిన మా హృదయాలు తల్లడిల్లిపోయాయి. నేను, అమ్మ వాటి గురించే మాట్లాడుకుంటున్నాం. మా అక్కయ్య సూరత్‌లో ఉంటోంది. మా బావగారు ఓ టెక్స్‌టైల్స్ ఇండస్ట్రీలో మేనేజర్‌గా పని చేస్తున్నారు. సంవత్సరానికి రెండుసార్లు, వీలుంటే మూడుసార్లు పిల్లలతో సహా హైదరాబాద్‌కు వచ్చి వెళుతూ ఉంటుంది. అల్లర్లు జరిగిన వెంటనే మా ఇంటికి ఫోన్ చేసి కంగారు పడవద్దంటూ తమ క్షేమసమాచారాన్ని తెలపడంతో మేము స్థిమితంగా ఉన్నాం. అమ్మా, నేనూ గుజరాత్ గురించి మాట్లాడుకుంటున్న సమయంలోనే అనసూయ అరుపు వినబడింది. మా అమ్మ ఒక్కసారి అలర్ట్ అయింది.

"పిన్ని ఇంటికెళ్లిందని చెప్పి, ఆమెను పంపించేసెయ్‌రా! పట్టుకుంటే ఆ జిడ్డు ఓ పట్టానా వదల్దు" అంటూ మాఅమ్మ పక్కరూమ్‌లోకి వెళ్లిపోయింది.

కాలింగ్ బెల్ శబ్దం విని తలుపు తీశాను. ఊహించినట్లే ఎదురుగా అనసూయ నిలుచుని ఉంది. ఆమెను చూస్తూనే 'అమ్మ లేదు. పిన్ని దగ్గరికి వెళ్లింది' అబద్ధమాడుతున్న ఫీలింగ్ నా మొహంలో ఏ మాత్రం కనబడకుండా వుండేందుకు శతవిధాల ప్రయత్నిస్తూ చెప్పాను.

రెండు నిమిషాలు అనసూయ మౌనంగా తలుపు దగ్గరే నిలుచుంది. నావంక చూసింది. ఆ చూపులో భావం నాకర్థం కాలేదు. అమ్మ లేదనగానే నిరాశపడిందేమో అనుకున్నాను. 'సరే బిడ్డా మళ్లీ వస్తా' అంటూ కాసేపు తనలో తాను ఏమిటో గొణుక్కుంది. ఏదో అడగాలని ప్రయత్నించింది. ఆమెకు ఆ అవకాశం ఇవ్వకుండా నేను వెంటనే తలుపు వేసేశాను.

మరుసటి రోజు కూడా మధ్యాహ్నం వేళకే అనసూయ కేక వినిపించింది. బాల్కనీలోకి వెళ్లి చూశాను. అనసూయ గేటు తీసుకుని లోపలికి రాబోతుంది. ఆమెను చూస్తూ, 'అమ్మ నిద్రపోతుంద'ని మరోమారు అబద్ధమాడాను. అనసూయ కాసేపు అక్కడే నిల్చుంది. చీరకొంగుతో మొహాన్ని తుడుచుకుంది. మళ్లీ ఏదో అడగాలన్నట్టుగా కాసేపు నిల్చుంది.

ఆమె ఎలాగు వద్దంటుందనే విషయం నాకు తెలుగు కాబట్టే కాస్త ధైర్యంగా 'నిద్ర లేవనా?' అని అడిగాను.

నేనూహించినట్టే ఆమె 'వద్దు బిడ్డ. పడుకోనియ్. రాత్రి యే వేళకు నిద్ర పోయిందో ఏమో' అంటూ గంపను మళ్లీ నెత్తిమీద కెత్తుకుంది.

ఆమె ఎప్పుడెళ్లిందో గమనించకుండానే నేను బాల్కనీ నుంచి వచ్చేశాను.

000

బాల్కనీలో ఉన్న గులాబీ మొక్కలకు అంటుకున్న చీడను తొలగిస్తూ 'ఊరికే ఆ టీవీకి అతుక్కుపోవడం కంటే కాస్త మొక్కలకు మందు కొట్టొచ్చుగదరా' అంటూ అమ్మ మెత్తగా మందలించడంతో నేను కాసేపు బాల్కనీలోకి వచ్చి చీడపట్టిన ఆకులు తుంచేసి మొక్కలను సరి చేయడం ఆరంభించాను. ఇంతలో సందు చివర నుంచి అనసూయ రావడాన్ని మేమిద్దరం గమనించాము. ఆమె కూడా మమ్మల్ని చూసింది. అమ్మ గత్యంతరం లేని పరిస్థితుల్లో అనసూయకు దొరికిపోయింది.



మా దగ్గరికి వచ్చి తలపై భారంగా ఉన్న గంపను కిందికి దింపింది. నెత్తిమీద చుట్టలా చుట్టివున్న తుండుగుడ్డను తీసి దులిపి శరీరానికి అంటిన చెమటను తుడుచుకొని ఒక నిట్టూర్పు విడిచింది. అనసూయ మాట్లాడే లోపుగానే 'ఇప్పుడు బట్టలు గిట్టలు లేవు. మరో నెల రోజుల తర్వాత కనిపించు చూద్దాం' కాస్త కరుగ్గానే అంది అమ్మ.

అమ్మ మాటలకు అనసూయ మొహం కాస్త చిన్నబోయింది. అమ్మవంక చూసి తలదించుకుంది. అంతలోనే తలపైకెత్తి 'నేను అందుకు రాలేదమ్మా. చిన్నమ్మ ఎలా వుందో వాకబు చేద్దామని మొన్నటి నుంచి తిరుగుతున్నాను. గుజరాత్‌లో కొట్లాటలు జరుగుతున్నాయని మా చిన్నోడు చెప్పినప్పటి నుంచి లక్ష్మమ్మ ఎలాగుందో గుబులుగా ఉందమ్మా' నెమ్మదైనా స్వరంతో అనసూయ అంది. ఆమె మాటల్లో మా అక్క క్షేమం గురించి తెలుసుకోవాలనే తపన కొట్టొచ్చినట్లు ధ్వనించింది.

మా అమ్మ మొహంలో చిరాకు స్థానానే వర్ణించలేని మరో భావం చోటు చేసుకుంది. నా మొహంలో కూడా రంగులు మారాయి. తనకే మాత్రం సంబంధం లేకపోయినా, కేవలం వ్యాపారపరిచయమే అయినా మా పట్ల, మా అక్క క్షేమం పట్ల సాటి మనిషిగా అనసూయలో కలిగిన ఆరాటం, తపన తెలిసొచ్చాక ఆమెను తప్పించుకోవడానికి ప్రయత్నించిన మాలో మాటలకందని గిల్టీనెస్. ఆ అనురాగానికి మా ఇద్దరి కళ్లలో ఒక్కసారిగా నీళ్లు చిప్పిల్లాయి. అంతే. ఒక్క క్షణం కూడా అక్కడ నిల్వోలేక లోపలి గదిలోకి వెళ్లిపోయాను.

ఇప్పుడు మా అమ్మకు మంచి స్నేహితురాళ్లలో అనసూయ ఒకరు. అనసూయంటే మా ఇంట్లో వాళ్లందరికీ ఇష్టమే. ■

## లియాండర్ 'మహిమా'!

'కురుక్షేత్ర, ప్యార్ కి కసమ్' సినిమా షూటింగ్ సందర్భంగా మహేష్‌మంజ్రేకర్ ప్రాపకం సంపాదించిన మహిమాచౌదరీ తాజాగా 'ప్రాణ్ జాయె పర్ చాల్ న జాయె' సినిమా కోసం 27 రోజుల షూటింగ్ తేదీ ఖరారు చేసి దర్శకుడికి నానా తిప్పలు పెడుతోందట. సమయానికి సరిగా రాకపోవడం, తన పాత్ర పరిధి పెంచమని, సినిమాలో ఇంకా నాలుగుపాటలు ఉండాలని, మరో హీరో కావాలని డిమాండ్ చేస్తోందట. సెట్‌లోకి రాకుండా ఫైవ్ స్టార్ హోటల్లో టెన్నిస్ ఆటగాడు లియాండర్‌పేస్‌తో ఎంజాయ్ చేస్తూ సమయాన్ని ఇట్టే గడిపేస్తోందిట. ఈ విషయం తెలుసుకున్న రవీనాటాండన్ దర్శకుడు మహేష్‌మంజ్రేకర్‌ను కలవగా ఆమెతో షూటింగు జరపడానికి ఒప్పుకున్నాడట!

- జె.